# పాపం ఆనందరావు

ఎ. నాగలక్ష్మి నరసింహమూర్తి

షికారు ముగించుకుని తిరిగి వస్తున్న ఆనందరావు, రాజారావులకు "ధైర్యలక్ష్మి లాటరీ టిక్కెట్లు" కొనండి, డబ్బు గెలుచుకుని ధైర్యంగా వుండండి! అన్న ధైర్యలక్ష్మి లాటరీ ఏజెంటు మాటలు మైకులోంచి వినిపిస్తున్నాయి.

ఆనందరావు, రాజారావులు ఉపాధ్యాయులు, స్నేహితులు. ఒకరి మాటంటే ఒకరికి గురి, నమ్మకం. వాళ్లిద్దరి మధ్యన దాపరికాలుండవు. ఒకే వీధిలో వుంటున్నారు. నడుస్తున్న ఆనందరావు "ఠక్కున" ఆగిపోయాడు. "ఏంటోయ్! అలా ఆగిపోయావు. పార్కులో ఏమైనా మఱచిపోయావా?" నవ్వుతూ అన్నాడు రాజారావు. "మరచి పోవడం కాదోయ్! మైకులోంచి వస్తున్న ఆ మాటలు విన్నావా?" అన్నాడు ఆనందరావు. "ఆ! విన్నాను లేవోయ్! లాటరీ టిక్కెట్లు కొనమంటున్నారు. మనలాటి వాళ్లకు ఆ లాటరీలు రావోయ్! ఎందుకొచ్చిన గొడవ. అయినా ఒకసారి ఆ అపోహలో పడితే మన జీతమంతా లాటరీ టిక్కెట్లకే తగలేస్తాము పద, పద" అన్నాడు రాజారావు. "అదికాదోయ్! రాజారావు మన అదృష్టం ఎలావుందో ఎవరు చెప్పగలరు. టిక్కెట్టు రెండు రూపాయలే కదా! చెరో రూపాయి ఇచ్చి కొందాం" అని బలవంతాన రాజారావుతో ఒప్పించి ఒక లాటరీ టిక్కెట్టు కొన్నాడు ఆనందరావు. "రాజారావు ఈ టిక్కెట్టు నీ దగ్గరే వుంచు, ఫలితాలు వారం పోయిన తరువాత తెలుస్తాయి" అన్నాడు టిక్కెట్టు అందిస్తూ ఆనందరావు. 'ఈ లాటరీ లంటే



నాకు నమ్మకం లేదని నీకు తెలుసుకదా ఆనందరావు. అయినా నాచేత ఒప్పించి బలవంతాన టిక్కెట్టు కొనిపించావు. ఫలితాలు కూడా నాకు చూడటం రాదు. నాకెందుకు ఆ టిక్కెట్టు నీ దగ్గరే వుంచు,' అన్నాడు రాజారావు ఆనందరావుతో.

వారం రోజులు పోయిన తరువాత పేపర్లో 'ధైర్యలక్ష్మి లాటరీ' 'ఫలితాలు' చూసిన ఆనందరావుకు ఆనందంతో నోట మాట రాలేదు. రాజారావు, తను కలసి కొన్న టిక్కెట్టుకు మొదటి బహుమతిగా 'లక్ష రూపాయిలు' రావటం ఆ ఆనందానికి కారణం. ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు ఆనందరావుకు. ఈ విషయంలో రాజారావుకు తాను సగం డబ్బు యివ్వాలి. డబ్బును చూస్తే ఎవరికైనా 'దుర్బుద్ధి' పుడుతుంది అన్న నానుడి ఆనందరావు విషయంలో నిజమైంది. అతనిలో వున్న 'ఆశ' అనే దుర్బుద్ధి అతని తలకెక్కి మెదడు నుంచి కదలలేదు. వెంటనే ఓ దుష్ట ఆలోచన అతని మెదడులోనికి వచ్చింది. ఆ ప్రకారం చెయ్యాలనుకుని వెంటనే రాజారావు ఇంటికి బయల్దేరాడు ఆనందరావు. "ఏ వోయ్! ఆనందరావు, రా! రా! ఇంత ఉదయాన్నే వచ్చావ్, ఏమిటి? విశేషం" అంటూ గుమ్మంలోనే స్వాగతం పలికాడు రాజారావు. "ఏం లేదోయ్! ముందర ఆ గదిలోనికి పద నీకో శుభవార్త చెప్పాలి." అంటూ ఓ గదిలోనికి దారి తీసాడు ఆనందరావు. అతనిని అనుసరించాడు రాజారావు. "రాజారావ్! మనిద్దరం కలసి కొన్న లాటరీ టిక్కెట్టుకు వెయ్యి రూపాయలు బహుమతి వచ్చిందోయ్! ఆ టిక్కెట్టు మార్చాలి. అదో రెండు, మూణ్నెల్లు పట్టవచ్చు. నీకు డబ్బు అవసరం అని మొన్న చెప్పావు కదా, అందుకని నేనెలాగో తంటాలు పడి ఆ టిక్కెట్టు మార్చుకుంటానులే. ఇదిగో నీకు రావలసిన వాటా అయిదు వందలు" అని డబ్బు రాజారావు చేతిలో పెట్టాడు ఆనందరావు. "చాలా సంతోషం ఆనందరావు, సమయానికి డబ్బు సర్దుబాటు చేసావ్, నీ మేలు మరచిపోను" అన్నాడు రాజారావు. "నాదేం వుందోయ్! రాజారావ్, అంతా 'ధైర్యలక్ష్మి' దయ. మరో విషయం రాజారావు! మనకి లాటరీలో డబ్బు వచ్చిందన్న విషయం ఎవ్వరికీ తెలియనివ్వకు. టిక్కెట్టు నాదగ్గర వున్నది కదా! నాకేమైనా ప్రమాదము జరుగవచ్చు" అన్నాడు ఆనందరావు. "నాకు తెలీదుటోయ్ ఆనందరావు, నువ్వు ధైర్యంగా వుండు" అన్నాడు రాజారావు. "మరి నేవస్తాను" అని ఇంటికి చేరుకున్నాడు ఆనందరావు.

ఆనందరావుకు ఇప్పుడు ఆనందంగా వుంది. రాజారావుకి అసలు లాటరీ అంటే నమ్మకం లేదు. అలాంటిది లాటరీ రాలేదన్నా నమ్ముతాడు. కానీ తను తెలివిగా వెయ్యి రూపాయలొచ్చాయని అయిదొందలు యిచ్చాడు రాజారావుకు. దానికి రాజారావు చాలా సంతోషించాడు. మిగిలిన సొమ్మంతా తనకే మిగిలిపోయింది అనుకున్నాడు ఉత్సాహంగా ఆనందరావు.

ఆ మర్నాడు కాఫీ తాగుతూ పేపరు చూస్తున్నాడు ఆనందరావు. అప్రయత్నంగా అతని దృష్టి 'సవరణ' అనే చిన్న 'కాలమ్' మీద పడింది. అందులో ఇలా వుంది! "నిన్న జరిగిన ధైర్యలక్ష్మి లాటరీ డ్రాలో మొదటి బహుమతి పొందిన టిక్కెట్టు జె.కె. సిరీస్‌కి బదులు జె.ఎఫ్. అని ( గుర్తించవలెను) చదువుకోవలెను" అని వుంది. అది చదివిన ఆనందరావుకు తనను ఓ పెద్ద కొండమీదనుంచి ఎవరో క్రిందకు త్రోసినట్లు అనిపించింది. తన టిక్కెట్టు తెచ్చి పలుసార్లు చూసాడు. తన టిక్కెట్టు నెంబరంతా కరక్టే. కానీ తన టిక్కెట్టు జె.కె. సిరీస్, బహుమతి వచ్చిన టిక్కెట్టు జె.ఎఫ్. సిరీస్‌కు. ఆనందరావు మెదడు కెక్కిన 'దుర్బుద్ధి' పూర్తిగా క్రిందకు దిగిపోయింది. అప్పుడనుకున్నాడు ఆనందరావు. డబ్బు ఎంత పాపిష్టిది. తనను నమ్మిన తన స్నేహితుడ్ని మోసం చేసి డబ్బంతా కాజేయాలనుకున్నాడు, తిరిగి తానే మోసపోయాననుకున్నాడు 'పాపం ఆనందరావు'. *


రు. 1000/-ల
బహుమతులు
గెలవండి!

## ద్రౌపది వ్యాసరచన పోటీ

వ్యాసాలలో ఉత్తమమైన వాటికి
1) బ్రీఫ్‌కేసు 2) చిన్నకామెరా 3) గోడగడియారం 4) ట్రాన్సిస్టర్ రేడియో, మరికొన్ని చిన్న బహుమతులు ఉంటాయి!

ప్రయాగ రామకృష్ణ సీరియల్ 'ద్రౌపది' వ్యాసరచన పోటీ-1 (9-2-'90, 16-2-'90 సంచికలలో), వ్యాసరచన పోటీ-2 (23-2-'90, 2-3-'90 సంచికలలో) ప్రకటించిన విధముగా నాలుగు ప్రశ్నలు చదివి వెంటనే ఏ రెండు ప్రశ్నలకైనా జవాబు వ్రాసి కూపన్ నెంబర్-1 కూపన్ నెంబర్-2 రెండు జత చేసి ద్రౌపది వ్యాసరచన పోటీ, ఎడిటర్ , ఆంధ్రసచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3కి 12-5-'90 తేదీ లోపల చేరేలా పంపండి. ఇతర వివరాలకు 6-4-'90 సంచిక తిరగేయండి.

బహుమతుల సమర్పణ, నాగేశ్వరి పబ్లికేషన్స్, విజయవాడ-2 వారు-

ఎడిటర్